క్లుప్తంగా

ఉచిత యోగా శిక్షణ తరగతులు

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్ పార్క్‌లో ఈ నెల 24 శుక్రవారం నుంచి జూన్ 21వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉచిత యోగా ఆరోగ్య శిక్షణ ఇస్తున్నట్లు యోగా గురువు వి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి జీవన విధానం, ప్రకృతి ఆహారపు అలవాట్లు, యోగాసనాలు, ప్రాణాయామం, క్రియలు, ధ్యానం, యోగా థెరపీ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. యోగ సాధనతో పిల్లలకు, పెద్దలకు రోగ నిరోధశక్తి పెంపు, స్త్రీలకు అనారోగ్య సమస్యలు దూరం, ప్రత్యేకించి బీపీ, షుగర్, థైరాయిడ్, సయాటికా, గ్యాస్ట్రిక్, తలనొప్పి, అధిక బరువు నియంత్రణ తదితర ఉపయోగాలు లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్య వంతులు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 93474 67498 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

– క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి: గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడన్న వార్త గుప్పుమనడంతో చంద్రగిరి పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల అనంతరం హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం, వాటిని నివారించడానికి పోలీసులు తలమునకలయ్యారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పనపాకం ఆలయం వద్ద ఓ వ్యక్తి మృతదేహం స్థానికుల కంటపడింది. విషయాన్ని పోలీసులకు చేరవేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పనపాకానికి చేరుకుని ఆలయం చుట్టుపక్కల పరిశీలించారు. ఆలయం ముందు భాగంలో రక్తపు మరకలు ఉండడాన్ని గుర్తించారు. ఆలయం వెనుక వరకు ఆ మరకలు కనపడడంతోపాటు ఓ వ్యక్తిని గుర్తుపట్టలేని విధంగా మొహంపైన బండతో బాది హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య అనంతరం మృతదేహాన్ని లాక్కొని వెళ్లి ఆలయం వెనకవైపు పడవేసినట్లు తెలుస్తోందని తెలిపారు. ఈ ఉదంతం జరిగి రెండు రోజులు పైన కావస్తూ ఉండడంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. సంఘటన స్థలాన్ని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ రాజ్‌కుమార్, సీఐ రామయ్య, ఎస్‌ఐ అనిత పరిశీలించారు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను సంఘటన స్థలానికి పిలిపించి తనిఖీలు చేయించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్రం.. పునీతం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



ధ్వజావరోహణ కార్యక్రమం

- వైభవంగా ముగిసిన గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా చక్రస్నానం.. ధ్వజావరోహణం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా దేవదేవేరులు పల్లకిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరహారతులు సమర్పించారు. ఈ క్రమంలోనే ఉభయదేవేరీ సమేతంగా శ్రీవారు ఊరేగుతూ కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి చేరుకున్నారు. అర్చకులు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం.. చక్రస్నానం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగానున్న పీఆర్ తోటకు వేంచేపు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారు పీఆర్ తోట నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 8.40 గంటలకు అర్చకులు ధ్వజావరోహణం చేపట్టి ఉత్సవాలను పరిసమాప్తం చేశారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి సూపరింటెండెంట్ మోహన్‌రావు పాల్గొన్నారు.



స్నపన తిరుమంజనం జరిపిస్తున్న వేదపండితులు



చక్రస్నానంలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి,చక్రత్తాళ్వార్

శ్రవణానందకరం ప్రియా సిస్టర్స్ గానామృతం





సంకీర్తనలు ఆలపిస్తున్న ప్రియా సిస్టర్స్, సర్వోత్తమరావు రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న భూమన్, జేఈఓ

తిరుపతి కల్చరల్: ప్రఖ్యాత కర్ణాటక సంగీత సోదరీమణులు ప్రియా సిస్టర్స్ గాత్రం నుంచి జాలువారి న అన్నమయ్య సంకీర్తనల గానామృతంతో భక్తులు తన్మయత్వం చెందారు. అన్నమాచార్య జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అన్నమయ్య రచించిన గీతాలలో కొత్త వాటిని షణ్ముగప్రియ, హరిప్రియ తమ వాయిద్య బృందంతో కలిసి సుమధురంగా ఆలపించి సభికుల హృదయాలను ఓలలాడించారు. ఈ సందర్భంగా కళాకారులను, అన్నమాచార్య వంశీయులను జేఈఓ గౌతమి ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా సర్వోత్తమరావు రచించిన రెండు పుస్తకాల ను జేఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలను ఆరు శతాబ్దాల తర్వాత కూడా ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారన్నారు. ప్రియా సిస్టర్స్ గాత్ర మాధుర్యంతో అన్న మయ్య సంకీర్తనల్లో కొత్త వాటిని పరిచయం చేయ డం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో శ్వేత డైరెక్టర్ భూమన్, వెంగమాంబ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్రమణ్యంరెడ్డి, వీజీఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.

విశేష అలంకరణలో గంగమ్మ



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మ తల్లి

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతి గంగ జాతర తర్వాత తొలి శుక్రవారం కావడంతో ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా అమ్మవారికి అలంకరించి కొలువుదీర్చారు. శుక్రవారం కావడంతో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు.

విజయోత్సవ ర్యాలీలు నిషిద్ధం

– చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ రాజ్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్ రాజ్‌కుమార్

చంద్రగిరి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు అనంతరం చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పలు కఠిన నిర్ణయాలను తీసుకుంది. ఇందులో భాగంగా జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు సమయంలో, అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిషేధిస్తున్నట్లు చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ రాజ్‌కుమార్ అన్నారు. చంద్రగిరి పోలీస్‌స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది అనుకుంటున్న సమయంలో కొన్ని హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. అలాంటి సంఘటనలతో ఉన్నతాధికారులు పలు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రతి గ్రామంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. అంతేకాకుండా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్ పోలీస్ టీమ్‌లు క్యూఆర్‌టీ టీమ్‌లను నియమించామన్నారు. సంఘవిద్రోహ శక్తులపై కానీ, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసినా యథాస్థితి ఏర్పడే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు అందుబాటులో ఉంటాయన్నారు. దీనిని గమనించి నియోజకవర్గ ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్‌ఐ అనిత పాల్గొన్నారు.

రాస్ గంగ జాతర మహోత్సవం



శ్రీధనకోటి గంగమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: రాస్ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో శ్రీధనకోటి గంగమ్మ ఆలయంలో శుక్రవారం గంగ జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలతో వేదమంత్రాల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గంగమ్మ తల్లి జాతర పూజలు నిర్వహించారు. మహిళలు వివిధ వేషధారణలో హాజరై సందడి చేశారు. రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, ఆలయ చైర్మన్ రంగారెడ్డి, సభ్యులు నారాయణ, రాస్ సిబ్బంది నాగేశ్వర్, కరుణాకర్, ఈశ్వరి, సుజాత, తులసమ్మ, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

భాకరాపేట: సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలతో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి వెంటనే ఏర్పాటు చేసి తాగునీరు, వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులను కోరారు. అలాగే వర్షాలుతో దెబ్బతిన్న తాగునీటి మోటార్లను వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్‌కో లేఈ మాట్లాడుతూ మండలంలో 52 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. తాగునీటి మోటార్లను వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తెలిపారు.

ఈ సమావేశంలో ఎంపీడీఓ దేవంద్రబాబు, డిప్యూటీ తహశీల్దార్ అన్వర్, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయండి



సోలార్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. తూకివాకం గ్రీన్ సిటీలోని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ తీరును పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇదే ప్రాంతంలో ఉన్న 6 మెగా వాట్స్ గ్రౌండ్ మౌంట్ సోలార్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పనులు పూర్తిస్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన సోలార్ ప్లాంట్ పనులను పూర్తి చేసి విద్యుదుత్పత్తి చేయాలన్నారు. అదేవిధంగా వినాయకసాగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన 5 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్ట్ పనులపై అలసత్వం వహించడం కారణంగా విద్యుదుత్పత్తి సకాలంలో చేయలేక పోయామన్నారు. తద్వారా కార్పొరేషన్‌కు భారంగా మారిందన్నారు. పనుల నిర్లక్ష్యంపై కాంట్రాక్టర్‌ను ఆరా తీశామన్నారు. మరో నెలలోపు ప్రాజెక్ట్ పూర్తి కాకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. వినాయక సాగర్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజినీర్లు చొరవ తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, డీఈ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో ఈ తనిఖీలు చేశారు. సరైన రికార్డులు లేని 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమల్లో ఉందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ఎలాంటి గొడవలు, ర్యాలీలు చేయకూడదన్నారు. 144వ సెక్షన్ అమల్లో ఉందని గుర్తు చేశారు. అదే విధంగా నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 1వ, 2వ పట్టణ సీఐలు, ఎస్‌ఐలు, 35 మంది పోలీసులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



పట్టు వస్త్రాలతో ఆలయ పాలకమండలి ఊరేగింపు

శ్రీకాళహస్తి (తొట్టంబేడు) : శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఇతర సభ్యులు ఆలయం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్ల కల్యాణ క్రతువు ఆరంభమైంది. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవోపేతంగా ముగించారు.

కార్యక్రమంలో అనుబంధాలయాల అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, అనిల్‌కుమార్‌శర్మ, చెన్నకేశవ స్వామి, శర్మ, అర్ధగిరిస్వామి, ఉభయదారులు అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

టపాకాయల గోదాముల్లో తనిఖీలు





తిరుపతి జిల్లాలో ఉన్న బాణసంచా గోడౌన్లలో ఆయా ప్రాంతాల్లోని డీఎస్పీలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు డీఎస్పీలు బాణసంచా గోడౌన్లలో అన్నింటికీ లైసెన్సులు ఉన్నాయా లేదా అనేది పరిశీలించారు. శ్రీకాళహస్తి, పుత్తూరు నాయుడుపేట, చంద్రగిరి, గూడూరు, రేణిగుంట, తిరుపతి టౌన్లలోని గోడౌన్లకు లైసెన్సులు ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. ఎన్నికల కౌంటింగ్ అయ్యేంతవరకు ఎవరికీ టపాకాయలు, బాణసంచా విక్రయించ వద్దని అధికారలు ఆదేశించారు. ఈ ఆదేశాలను ఎవరు అతిక్రమించినా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాణసంచా కావాలని దుకాణాల యజమానులను ఎవరైనా బలవంతం చేస్తే వేంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. - తిరుపతి క్రైం





తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లోని బాణసంచా గోడౌన్లలో తనిఖీలు చేపడుతున్న పోలీసు అధికారులు

కూలీల సంఖ్యను పెంచాలి

ఏర్పేడు: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. మండలంలోని ఆమందూరులో శుక్రవారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేనందున కూలీలకు విరివిగా పనులు కల్పించాలన్నారు. ఎండతీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 6 నుంచి 10 గంటల్లోపు పనులు చేపట్టాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. ఏర్పేడు మండలంలో ప్రతి రోజు 4 వేల మంది కూలీలు పనులకు తగ్గకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దేవరి, సాంకేతిక సహాకుడు రవీంద్రుడు పాల్గొన్నారు.

వినాయక మండపం పనుల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి వద్ద చేపట్టిన వినాయక మండప పనులను శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞానగిరి వద్ద ఉన్న వినాయక మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం రూ.10లక్షల వ్యయంతో పాలకమండలిలో తీర్మానం చేసి పనులు ప్రారంభించామన్నారు. రాబోయే కుమారస్వామి బ్రహ్మోత్సవాల్లోపు పూర్తి చేస్తామన్నారు. కుమారస్వామి కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.